

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 15.01.2026 | సంపుటి : 2 | సంచిక :340 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI Thursday 15.01.2026 volume : 2 Issue : 340 Pages : 8 Cost : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575





పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు

## సంక్రాంతి

శుభాకాంక్షలు

## సెలవు

సంక్రాంతి పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. శనివారం పునర్దర్శనం



06

## ఇరాన్‌ను తక్షణమే వీడండి

భారతీయులకు విదేశాంగశాఖ హెచ్చరిక

# ఈ-చలానా చెల్లింపుల్లో మోసం..

## తీగ లాగితే.. కదులుతున్న డొంక..!

### తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్ట్రార్ల పత్రపై అనుమానాలు

### కూపీ లాగుతున్న అధికారులు

ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి ఎన్ని లావాదేవీల్లో ఇలాంటి పొరపాట్లు జరిగి ఉంటాయనే దానిపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.వందల కోట్ల విలువైన భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో మాత్రం రుసుం మొత్తంలో నామమాత్రంగా 1శాతం చెల్లించినా లావాదేవీలు పూర్తయ్యాయి. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉంటే... దస్త్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన తహసీల్దారులు/ సంయుక్త సబ్ రిజిస్ట్రార్లు మిన్నకున్నారు. 2020లో ప్రైవేటు సంస్థ ద్వారా ప్రారంభమైన ధరణి నుంచి ప్రస్తుత భూభారతి వరకు... అనేక సాంకేతిక లోపాలు కనిపించడం గమనార్హం. జనగామలో వెలుగుచూసిన సాగు భూముల రిజిస్ట్రేషన్ ఈ-చలానా చెల్లింపుల్లో మోసం వ్యవహారంలో రోజురోజుకు అనేక కొత్త విషయాలు బహిర్గతం అవుతున్నాయి.



ఏసిబి ఎస్పీ సింధుశర్మ నేతృత్వంలోని హైలెవెల్ కమిటీ ఈ వ్యవహారంపై అన్వేషణ ప్రారంభించింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించిన ప్రకారం... భూమి మార్కెట్(బుక్ వాల్యూ) విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీ, మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2,500, పాస్ పుస్తకానికి రూ.350, హరితపన్నుగా రూ.50... ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించాలి. మార్కెట్ విలువ ఆన్‌లైన్‌లో ముందుగానే నిర్ధారించి ఉంటుంది. సర్వే నంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఎంత చెల్లించాలనేది కంప్యూటర్ తెరపైన కనిపిస్తుంది. చెల్లింపుల్లో ఏ ఒక్క రూపాయి తక్కువైనా ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా తిరస్కారానికి గురవుతుంది. కానీ, 4,800 లావాదేవీల్లో 1శాతం రుసుం మాత్రమే చెల్లించినా ఎక్కడా రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవలేదు.

హైదరాబాద్, జనవరి 14 : ధరణి/భూభారతి పోర్టల్‌లో ఉన్న బలహీన సాంకేతికత అక్రమ లావాదేవీలకు ఆస్కారం కల్పించిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ధరణిని ప్రైవేటు సంస్థ నిర్వహించగా, ఇప్పుడు భూభారతి ఎన్ఐసీ చేతిలో ఉంది. ధరణి నుంచి భూభారతిగా మారిన తర్వాత కొనసాగిన లోపాలు, ప్రస్తుతం వెలుగు చూసిన ఈ-చలాన్ల సొమ్ము దారిమళ్లింపునకు అనుమతిచ్చిన సాఫ్ట్‌వేర్ బలహీనతలపై

-మిగతా 2 లో..



# స్వయంగా పొంగలి వండిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, జనవరి 14 : పొంగల్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా తొలుత ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రధాని నిర్వహించారు. అనంతరం ఆయనే స్వయంగా పొంగల్ వండారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోవులకు పూజ చేశారు. పొంగల్

-మిగతా 2 లో..

# రిజర్వేషన్లు ఖరారు

## తెలంగాణ మున్సిపాలిటీలకు నోటిఫికేషన్ జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 121 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డులు, చైర్పర్సన్, మేయర్ పదవులకు సంబంధించిన

-మిగతా 2 లో..



# మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో ఇప్పుడే అభివృద్ధి

## అవి వెనుకబడిన జిల్లాలు

### జిల్లా పర్యటనలో పలు కార్యక్రమాలకు మంత్రుల శ్రీకారం

మహబూబ్‌నగర్, జనవరి 14 : మహబూబ్‌నగర్, నల్గొండలు వెనకబడిన జిల్లాలని.. ఇప్పుడు ఈ రెండు జిల్లాలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి పర్యటించారు. ఈ

-మిగతా 2 లో..



# చట్ట పరంగానే విలేకరుల అరెస్టు

## మహిళా ఐఏఎస్‌పై అసత్య కథనాలు

### విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా

### రాత్రికి రాత్రే ఫ్లైట్ టిక్కెట్ బుక్ చేసుకుని పరారీ

### అందుకే ఇద్దరిని అరెస్ట్ చేశాం.. వివరాలు త్వరలో వెల్లడిస్తాం

### మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



హైదరాబాద్, జనవరి 14 : ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్

-మిగతా 2 లో..



## మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు

# టీవీ ఛానల్ జర్నలిస్టుల అరెస్ట్

హైదరాబాద్, జనవరి 14 : తెలంగాణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరఫున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78



# 29మంది మావోల లొంగుబాటు

రాయపూర్, జనవరి 14 : మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎమ్ఎస్) నేత పొడియం బుధ్రాతో పాటు డీఏకేఎమ్ఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో

-మిగతా 2 లో..



# మెడలు తెగిపోతున్నయ్!

## సంగారెడ్డి జిల్లాలో దారుణం

### బైకర్ మెడకు తగిలి కోసుకున్న మెడ

### తీవ్రగాయంతో వ్యక్తి మృతి

### కర్నాటకలోనూ మరొకరు మృతి

చైనా మాంజా యమ పాశంగా మారి దేశవ్యాప్తంగా అనేక మందిని బలి తీసుకుంటోంది. సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు.

2 లో..

# విచారణ జరిగే లోపే అరెస్టు ఎందుకు

## జర్నలిస్టుల అరెస్టు దారుణం

### రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో

### మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 14 : తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో

-మిగతా 2 లో..



## మురుగున్ నివాసంలో పొంగల్ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. మరోవైపు ఈ పొంగల్ వేడుకను పలువురు ప్రముఖులు ఘనంగా జరుపుకుంటున్నారు. అలానే దేశ వ్యాప్తంగా ప్రజలు వివిధ రకాల వంటకాలు చేసుకుని, ఇళ్లను అలకరించుకుని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.




## తీగ లాగితే.. కదులుతున్న డొంక..!

(మొదటిపేజీ తరువాయి)

రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరందు వీటిపై ఎన్ఐసీ నిపుణులతో చర్చిస్తున్నట్లు సమాచారం. సాగు భూముల రిజిస్ట్రేషన్లకు అత్తెసరు ఛార్జీలు చెల్లించినా వాటిని ఆమోదించి డీడ్స్‌పై సంతకాలు చేసిన తహసీల్దార్ల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ సెంటర్‌లో చలానా చెల్లించి నిర్దిష్ట తేదీన తహసీల్దారు-సంయుక్త సబ్ రిజిస్ట్రార్ వద్దకు భూముల క్రయ, విక్రయదారులు, నలుగురు సాక్షులు కూడా వస్తారు. పాసుపుస్తకాలను, ఫొటోలను, సెల్ నంబర్లను పరిశీలించుకోవడం, రికార్డుల్లో ఉన్న వ్యక్తి, హాజరైన యజమాని ఒక్కరేనా అనేది తేల్చుకోవడం తహసీల్దారు బాధ్యత. దీంతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వ నిబంధనల మేరకే చెల్లించారా అనేది కూడా తప్పనిసరిగా పరిశీలించడమనేది మరో ముఖ్యమైన విధి. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ ముఖ్య సహాయకుడిగా పనిచేయాలి. కీలక బాధ్యతల విషయంలో తహసీల్దార్లు, ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర అంశంగా రెవెన్యూ శాఖ భావిస్తోంది.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

పాటు ఇతర మావోయిస్టులు పోలీసులు ముందు లొంగిపోయారు. తమ ఆయుధాల ను సరెండర్ చేశారు. పొడియం బుద్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది మావోయిస్టులు ఆయుధాలను త్యజించి జన జీవన స్రవంతిలోకి వస్తున్నారని చెప్పారు. నక్సలిజంను వీడి సామాన్య జనజీవనాన్ని అవలంబించాలని ఈ సందర్భంగా ఇతర మావోలకు ఆయన పిలుపునిచ్చారు. కొంతకాలంగా మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతుండటంతో గోగుండ ప్రాంతంలో (దర్భా డివిజన్) ఉద్యమ ప్రాబల్యం మరింతగా తగ్గినట్లైంది. గోగుండలో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకూ తగ్గిపోయాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మావోయిస్టు మద్దతుదారుల నెట్‌వర్క్ బలహీనపడిందని, ఫలితంగా సరెండర్లు పెరిగాయని చెబుతున్నారు. జనవరి 8న దంతేవాడలో 63 మంది సరెండర్ కాగా అంతకుముందు రోజున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500 మంది లొంగిపోయారు. ఈ ఏడాది మార్చ్ 31 నాటికి నక్సలిజంను రూపుమాపాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.

## జర్నలిస్టుల అరెస్టు దారుణం

(మొదటిపేజీ తరువాయి)



స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతు న్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాల ని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# మహబూబ్‌నగర్, నల్గొండలు వెనకబడిన జిల్లాలు

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా భూత్పూర్‌లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం.. కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంత బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. నేడు రూ.60 కోట్లతో మూడు మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. అలాగే కురుమూర్తి స్వామి దేవాలయానికి ఘాట్ రోడ్డు కోసం రూ.140 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పనులు పూర్తయినట్లు బీఆర్ఎస్ చెబుతోందని.. కానీ రూ.27000 కోట్లు మాత్రమే ఎలా ఖర్చు అయిందని ఆయన ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణపై కేసీఆర్‌కు ప్రేమ లేదని.. అందుకే ఇక్కడ కేవలం మూడు సీట్లు మాత్రమే వచ్చాయని మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కలేదని విమర్శించారు. 20 రోజుల్లో మునిసిపల్ ఎన్నికలు, త్వరలో జిల్లా పరిషత్ ఎన్నికలు రాబోతున్నాయని కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎప్పుడో ఒకసారి బయటకు వచ్చేవారని.. కానీ రేవంత్ రెడ్డి ఎల్లవేళలా ప్రజల్లోనే ఉంటారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



## విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు.



అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

## తెలంగాణ మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, అన్‌రిజర్వ్ కేటగిరీలకు సీట్ల కేటాయింపునకు మార్గదర్శకాలను, డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించింది. మున్సిపాలిటీల్లో వార్డుల రిజర్వేషన్‌పైనా ప్రభుత్వం నోటిఫికేషన్‌లో మార్గదర్శకాలను పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సీట్ల కేటాయింపుపై స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించింది. మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదనే రాజ్యాంగ మార్గదర్శకాలను ప్రభుత్వం పాటించినట్లు స్పష్టం చేసింది.

## మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికారుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## తుమ్మిడిహెట్టి-సుందిళ్ల అనుసంధానంతో బహుళ ప్రయోజనాలు

- హైదరాబాద్‌కు వాటర్‌గ్రిడ్.. మల్లన్నసాగర్‌లో నీటి నిల్వపై దృష్టి
- బృహత్తర ప్రణాళిక దిశగా అడుగులు
- నీటిపారుదల శాఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం



**హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా మూడో టీఎంసీ కోసం చేపట్టిన పనులను వినియోగించుకోవడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. గోదావరి నుంచి మేడిగడ్డ ద్వారా మిడ్‌మానేరు వరకు మొదట రోజుకు రెండు టీఎంసీల నీటిని తరలించేలా గత ప్రభుత్వం నిర్మాణాలు చేసింది. తదుపరి మరో టీఎంసీ కూడా తరలించేలా పనులు చేపట్టింది. మూడో టీఎంసీకి దాదాపు రూ.34 వేల కోట్ల అంచనాలతో నిర్మాణాలు చేపట్టగా.. సుమారు రూ.18,000 కోట్ల పనులు పూర్తయ్యాయి. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పనులను.. ప్రస్తుతం తిరిగి వినియోగంలోకి తేవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు ఎత్తిపోయడానికి ప్రభుత్వం డీపీఆర్ రూపకల్పనకు ఉత్తర్వులు జారీచేసింది. అయితే సుందిళ్లకు వచ్చే ఈ జలాలను ఎల్లంపల్లి, మధ్యమానేరు ద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు వేగంగా తరలించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలో గతంలో చేపట్టిన మూడో టీఎంసీ పనులను వినియోగంలోకి తేవాలని ఆలోచన చేస్తోంది. ఇప్పటికే చేసిన ఖర్చు ఎంత? పూర్తిస్థాయిలో పనులు అందుబాటులోకి రావాలంటే ఇంకా ఎంత ఖర్చు పెట్టాలి? అనే దానిపై పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా నీటి పారుదల శాఖను ఆదేశించినట్లు తెలిసింది. హైదరాబాద్ నగరం విస్తరిస్తుండగా.. పారిశ్రామిక, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లకు నీటిని తరలించేందుకు పనులు చేపడుతున్నారు. దీంతోపాటు హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మల్లన్నసాగర్‌లో పెద్దఎత్తున నీటి నిల్వకు అవకాశం ఉండడంతో దాన్ని ఎందుకు వినియోగించుకోవద్దనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు.. అక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని సరఫరా చేసి.. భవిష్యత్తు అవసరాలకు నీటి నిల్వలు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని భావిస్తోంది. హైదరాబాద్ నగరానికి పవర్ గ్రిడ్ మాదిరి.. వాటర్ గ్రిడ్ ఒకటి ఉంటే బాగుంటుందని సీఎం సూచించినట్లు తెలిసింది. మూడో టీఎంసీ పనులు.. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాల్లో నీటినిల్వకు ఉన్న అవకాశాలు.. హైదరాబాద్‌కు ఆ నీటి తరలింపు.. వీటన్నింటిపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి.. నీటిపారుదలశాఖను ఆదేశించినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా వాటర్ గ్రిడ్‌కు సంబంధించి ప్రతిపాదనలతో రావాలని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను సీఎం ఆదేశించినట్లు తెలిసింది. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులు చక్కగా చేయకుంటే.. ప్రభుత్వానికి తలనొప్పి వచ్చే అవకాశాలు ఉంటాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. భారాస ప్రభుత్వంలో 2023లో కుంగుబాటు, ఇతర లోపాల తో బయటపడ్డ 3 బ్యారేజీలను జాగ్రత్తగా వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు సమాచారం. బ్యారేజీల పునరుద్ధరణకు ఆసక్తి వ్యక్తీకరణ పద్ధతి ద్వారా డిజైనర్ సంస్థను నీటిపారుదల శాఖ ఎంపిక చేస్తోంది. ఈ విషయంలో జాగ్రత్త వహించాలని, డిజైన్లను కేంద్ర జల సంఘానికి పంపించి.. పక్కాగా నిర్ధారించుకున్నాకే పనులు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. లేదంటే లోపాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ వచ్చే అవకాశాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలిసింది.

## తమిళనాడులో 23న మోడీ పర్యటన

### అదేరోజు చెన్నైలో బహిరంగ సభకు ప్లాన్

**చెన్నై, జనవరి 14:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్డీయే తరఫున ప్రచార సభలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 23న రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఖరారైందని బీజేపీ రాష్ట్ర నాయకులు తెలిపారు. అదే సమయంలో ముందుగా అనుకున్నట్లు సభను మదురైకి బదులుగా రాజధాని నగరం చెన్నైలో ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్డీయేలో చేరిన అన్నాడీఎంకే ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందంజలో ఉంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రంలో ఎన్డీయేని బలపరచటంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మదురై నగరంలో ప్రధాని ప్రచార సభ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నిర్ణయించారు. గత వారం బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్ మదురై ప్రచార సభకు అనువైన ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి ప్రధాని మోదీ సభను రాజధాని నగరం చెన్నైలో నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర నాయకులు తీసుకున్న ఈ నిర్ణయానికి బీజేపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో నయినార్ నాగేంద్రన్ నగరంలో మోదీసభకు అనువైన రెండు ప్రాంతాలను ఎంపిక చేశారు. మహాబలిపురం సమీపం తిరువిడందై వద్ద సైనిక యుద్ధ సామగ్రి ప్రదర్శన జరిపిన ప్రాంతం మోదీ సభకు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు.

## ఓరుగల్లు కోటలో ఘనంగా భోగి మంటలు

### ఉత్సాహంగా పాల్గొన్న నగర ప్రజలు

**వరంగల్,జనవరి14 :** చరిత్ర కోట గోడల మధ్య సంక్రాంతి సంబురం మొదలైంది. మంచు కురుస్తున్న వేళ, ఓరుగల్లు లోగిళ్లు భోగి మంటల సెగలతో వేడెక్కాయి. మనసులోని మాలిన్యాలను వదిలించుకోవాలనే సందేశంతో నగరవాసులు భోగి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజామునే మహిళలు తమ ఇంటి ముందు కళ్లాపి చల్లి, అతి పెద్ద ముగ్గులను తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఖిలా వరంగల్, శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట, ఆదర్శనగర్, దూపకుంట, బొల్లికుంట, గాడిపల్లి గ్రామాలతో పాటు నగరంలోని పాతబస్తీలలో గొబ్బెమ్మల సందడి ప్రత్యేకంగా కనిపించింది. పసుపు కుంకుమలతో అలంకరించిన గొబ్బెమ్మల మీద నవధాన్యాలు చల్లి ప్రకృతిని పూజించడం విశేషం. నగరంలోని అపార్ట్‌మెంట్ కల్చర్‌లోనూ సంప్రదాయం వెల్లివిరిసింది. అపార్ట్‌మెంట్ వాసులంతా సామూహికంగా భోగి మంటలు వేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాత కాలపు ఆచారాలను నేటి తరానికి పరిచయం చేస్తూ, హరిదాసుల కీర్తనల మధ్య గడిపిన క్షణాలు అలరించాయి. టైర్ల వంటి హానికర వస్తువులను మంటల్లో వేయకుండా, కేవలం పిడకలు, చెక్క ముక్కలతో 'పర్యావరణ హిత భోగి'ని జరుపుకోవడం విశేషం. కులమతాలకు అతీతంగా బస్తీల్లో అందరూ కలిసి భోగి మంటల దగ్గర ఆత్మీయ ఆలింగనం చేసుకొన్నారు. మకర సంక్రాంతి కోసం వరంగల్ నగర మార్కెట్లు ఇప్పటికే కిక్కిరిసిపోయాయి. అలాగే పిండి వంటల వాసనలతో ఓరుగల్లు వీధులు ఘుమఘుమలాడుతున్నాయి.

# ఉరితాళ్లుగా చైనా మాంజా

- సంగారెడ్డి జిల్లాలో దారుణం
- బైకర్ మెడకు తగిలి కోసుకున్న మెడ
- తీవ్రగాయంతో వ్యక్తి మృతి



**సంగారెడ్డి, జనవరి 14 :** సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటు చేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ. 1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

### కర్నాటకలోనూ మరొకరు మృతి

బెంగళూరు, జనవరి 14 : తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు. బీదర్ జిల్లా తలమడగి వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితుడిని సంజు కుమార్ హళసమణిగా గుర్తించారు. హళసమణి బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మెడకు మాంజా చుట్టుకోవడంతో కోసుకుపోయి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైంది. ఆయన తన కూతురికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నంలో ఉండగానే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కల వారు గాయాలకు కర్చీఫ్‌లను అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశారు. మరికొందరు అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలోనే కన్నుమూశారు. హళసమణి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఆయన ప్రాణాలతోనే ఉండి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జాప్యమే ఆయన ప్రాణాలను తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో మృతుడి బంధువులు, స్థానికులు ధర్నాకు దిగారు. ఎమ్జర్గ÷న్సీ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాంజాపై నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇక ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

మకర సంక్రాంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గాలిపటాలను ఎగురవేయడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, గాలిపటాల కోసం సాధారణ మాంజాలకు బదులుగా కొందరు చైనా మాంజాలను వినియోగించడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల నుంచి వేళ్లాడే మాంజాలు వాహనదారులకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్స్‌పై ప్రయాణించే వారికి ఇవి యమ పాశాలుగా మారుతున్నాయి.

## మహిళపై ఉద్దేశ్యపూర్వక దుష్ప్రచారం

- వ్యక్తిగత దాడులు.. అసభ్య వ్యాఖ్యలు
- మహిళల అవమానాన్ని సహించేది లేదు
- ఎక్స్ వేదికగా సజ్జన్నార్ ఘాటు వ్యాఖ్యలు



**హైదరాబాద్, జనవరి 14 :** తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాలు ప్రసారం ఘటన తీవ్ర దుమారాన్ని రేపుతోంది. మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచిన కేసును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు సంస్థ సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ నడువనుంది. ఇదిలా ఉండగా.. మహిళా అధికారిపై అసత్య కథనాలు ప్రసారం చేయడంపై సీపీ సజ్జనార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరమని అన్నారు. ఇకపై మహిళలను అవమానిస్తే సహించేది లేదని సీపీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహిళలపై విమర్శ కాదు.. దుష్ప్రచారం నేరం. ప్రజా జీవితంలో విమర్శలు సహజమే. కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు, చరిత్ర హననం, అసభ్య వ్యాఖ్యలు విమర్శలు కావు.. అవి క్రూరత్వం. ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, గృహిణి అయినా మహిళ గౌరవం అపరిమితం. టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, వార్త కథనాల పేరుతో మహిళలపై దూషణలు అసహ్యకరం. నేడు ప్రతి పనిలో మహిళలు ముందువరుసలో నాయకత్వం వహిస్తున్నారు. పాలన, పోలీసు శాఖ, శాస్త్ర రంగం, మీడియా సహా ప్రజాజీవితంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇల్లు–ఉద్యోగం రెండింటినీ సమతుల్యం చేస్తున్నారు మహిళలు. కనిపించని బాధ్యతలతో కుటుంబాన్ని నడుపుతూ.. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు ప్రగతిపై దాడులే. భారతీయ సంప్రదాయం చెబుతున్న సందేశం ప్రకారం 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' .. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షం ఉంటుంది. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరం. వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మహిళలను గౌరవించని సమాజం భవిష్యత్తును కోల్పోతుంది. ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే నష్టం. స్పష్టమైన సందేశం ఒక్కటే.. మహిళలపై అవమానం, వివక్ష, చరిత్ర హననం ఇక సహించబోము. ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్.. ఆ భవిష్యత్తు గౌరవంతోనే నిర్మితమవుతుంది.. అవమానంతో కాదు' అంటూ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు.



## జిల్లాలను మారిస్తే తీవ్ర పరిణామాలు

**మాజీ స్పీకర్ మధుసూధనాచారి హెచ్చరిక**

**హనుమకొండ, జనవరి 14 :** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రతీకార పాలన కొనసాగిస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్ రెడ్డి జేజమ్మ తరం కూడా కాదన్నారు. కేసీఆర్ పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజనను చేశారని, జిల్లాలను మార్చే దుర్మార్గానికి ఒడిగడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. చేతనైతే ఇచ్చిన హామీ ప్రకారం సాగు సాయాన్ని పెంచి అందించాలని, ఏదో ఒక సాకుతో జిల్లాలలో మార్పులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో మార్పులు జరుగుతే తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాడే పార్టీ బీఆర్ ఎస్ పార్టీ అని గుర్తు చేశారు. గతానికి అదనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతగల ప్రభుత్వం దానికి భిన్నంగా జిల్లాలు కుదిస్తాం, మార్చేస్తాం అనే బాధ్యతారాహిత ప్రకటనలతో గందరగోళం సృష్టించి వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమన్నారు.

## రాజకీయ క్రీడలో భాగంగానే అరెస్టులు

**కాంగ్రెస్ సర్కరార్ తీరుపై ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం**

**హైదరాబాద్, జనవరి 14 :** ఎన్‌టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్ట్ ను ఖండిస్తున్నామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ క్రీడలో భాగంగా నచ్చిన వారిని మంత్రులను చేయడానికి టీవీ చానెళ్లకు లీకులు ఇచ్చి ఉపయోగించుకొని మరల వారి మీదనే సిట్ వేసి అరెస్టులకు పాల్పడుతుందని ఆరోపించారు. అర్ధరాత్రి అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జరుగుతున్న పరిణామాలన్నీ డ్రామాలని యావత్ ప్రజలకు తెలుసనీ, ఎమర్జెన్సీని తలపించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా వెంటనే విడుదలచేయాలి డిమాండ్ చేశారు. కాగా, ఎన్టీవీ ఇన్‌ఫుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

- పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, జనవరి 14 :** ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగపూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా– డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీవీ ఇన్‌ఫుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.

## జర్నలిస్టులపైనే సిట్ ఎందుకు?

- కాంగ్రెస్ నేతల అవకతవకలపై సిట్ వేయండి
- అన్నింటిపైనా దమ్ముంటే విచారణ జరపండి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్



**హైదరాబాద్, జనవరి 14 :** జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిల్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమీషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమీషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమీషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.

## 18న ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన

**సిపిఐ మహాసభలకు హాజరు**

**ఖమ్మం, జనవరి 14 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ మహాసభల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అదేరోజు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ. 25 కోట్లతో నూతనంగా నిర్మించిన మద్దులపల్లి మార్కెట్ యార్డ్, రూ. 25 కోట్లతో నిర్మించిన నర్సింగ్ కళాశాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ. 108 కోట్లతో నిర్మించబోయే జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. హెలిప్యాడ్ ప్రాంతాన్ని సీపీ సునీల్‌దత్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి.రాం ప్రసాద్, హరినాదబాబులు పరిశీలించారు.

## రైలు నుంచి కిందపడి ఆర్మీ జవాన్ మృతి

**వరంగల్, జనవరి 14 :** రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తు జారిపడి భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకి చెందిన సంతోష్ కుమార్ (48) పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఇండియన్ ఆర్మీ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే అండమాన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. అదే రోజు రాత్రి 10:40 గంటల సమయంలో రైలు కేసముద్రం– ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యకు రాగానే సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు రైలు నుండి కిందకు జారిపడ్డారు. ఈ ప్రమాదంలోఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుని వద్ద లభించిన ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసి, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన

**జర్నలిస్టుల అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, జనవరి 14 :** సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

## తలసానిపై పోలీస్ కేసు నమోదు

**హైదరాబాద్, జనవరి 14 :** మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి నేత తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి తలసాని చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రవికిరణ్ దేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఆర్ నగర్ పోలీసులు తెలిపారు.

## ఎన్టీవీ జర్నలిస్టు అరెస్టు తొందరపాటు చర్య

**కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి**



**హైదరాబాద్, జనవరి 14 :** ఎన్టీవీలో వచ్చిన ఓ కథనంపై రేవంత్ సర్కార్ ఓవర్ రియాక్షన్ చేస్తోంది. జర్నలిస్టులపై రేవంత్ సర్కార్ ప్రతాపంపై పౌరసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తాజాగా ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టులను కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఖండించారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం మంచిది కాదని హితవు పలికారు. నోటీసులు ఇచ్చి వ్యక్తిగతంగా వివరణ తీసుకుంటే బాగుండేదన్నారు. జర్నలిస్టుల అరెస్టులతో రాష్ట్రంలో యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. తెలంగాణ పోలీసుల చర్యలను ఖండిస్తున్నా.. తలుపులు బద్దలుగొట్టి దౌర్జన్యంగా బద్దలుగొట్టి ఇంట్లోకి వచ్చారు. పండగకు భార్యతో వెళ్తుండగా ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్‌ను లాక్కెళ్లడం సరికాదు. ప్రొసీజర్, నోటీసులు లేకుండానే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

# సంక్రాంతితోనే ఉత్తరాయణం ప్రారంభం!



**కాలగమనంలో మార్పును సూచించేదే సంక్రాంతి. చలికాం ముగిసిపోయి.. వెచ్చని అడుగులు పడుతున్నాయన్న సంకేతం ఇచ్చేదే సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి పయనించేది కూడా సంక్రాంతి నుంచే. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది. ఈ ఉత్తరాయణాన్ని దేవతలకు సంబంధించిన కాలంగా పరిగణిస్తారు. అందుకే ఈ కాలాన్ని ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. ఈరోజు నుంచి వివాహం, గృహప్రవేశం, నామకరణం, కొత్త వ్యాపారం వంటి ఇతర శుభ కార్యాలపై ఉన్న నిషేధం కూడా తొలగిపోతుంది. హిందువుల పండుగలు అన్నీ కానుగతిని బట్టి నిర్ణయించినవే. ఇందులో శాస్త్రీయతో పాటు, బలమైన సందేశం ఉంది. పండగల వైశిష్ట్యం అంతాఇంతా కాదు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంది. వాటిని ఆరించే విధంగా చేస్తున్నవే పండగలు.**

సంక్రాంతి పండగ తెలుగు వారికి పెద్ద పండగే అయినా...దేశంలోని పలు ప్రాంతాల్లో దీనిని పలు రకాలుగా జరుపు కుంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మకర సంక్రాంతి పండుగని సూర్యుడు రాశి మార్పు ఉత్తరాయణం ప్రారంభానికి సూచికగా భావిస్తారు. ఇదే రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం చేసిన షట్తిల ఏకాదశి అరుదైన కలయిక ఏర్పడుతోందని చెబుతున్నారు పండితులు. ఈ ప్రత్యేక యోగంలో చేసే పవిత్ర స్నానం, దానధర్మాలు, పూజలు మామూలు రోజులు చేసే పూజాఫలం కంటే అనేక రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు. షట్తిల ఏకాదశి ఉండటం వల్ల ఈరోజుకు మరింత విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో మకర సంక్రాంతి పండుగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు ఈ సంక్రాంతి పండుగని పెద్ద పండుగగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక శుద్ధి, నూతన శక్తికి సంబంధించిన పండుగగా పరిగణిస్తారు. ఈ పండుగ వేళ పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు, సూర్యారాధన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణం ప్రారంభిస్తాడు. అలాగే హిందూ సంప్రదాయం ప్రకారం మకర సంక్రాంతి రోజు చేసే దానధర్మాలు, పుణ్య కార్యాలు, పరిహారాలు ఏడాది పొడవునా సుఖశాంతులు, సిరిసంపదలు, శ్రేయస్సు కలిగిస్తాయని నమ్మకం. ఈ సంక్రాంతి పండుగ రోజు సాధారణంగా ఇరుగు పొరుగు వారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇస్తారు. సంక్రాంతి పండుగ, మకర సంక్రాంతి పండుగ అందమైన రంగవల్లులకు.. గొబ్బెమ్మలకు.. హరిదాసుల పాటలకు.. బసవన్నల ఆటలకు.. నువ్వుల మిఠాయిలకు.. గాలిపటాలు ఎగరేయడానికి ఇలా ఎన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ సంక్రాంతి పండుగను పంటల పండుగ అని.. అలాగే మార్పు తీసుకొచ్చే పండుగ అని కూడా అంటారు.

అలాగే ఈ పండుగలు అనేవి మన వర్తమాన, భవిష్యత్తులను గుర్తుచేస్తూ.. స్పృహతో మలచుకోవాలి అనే విషయాలను గుర్తుచేస్తాయి. అంతే కాకుండా ఈ సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడిని నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పించడం వల్ల ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయని పండితులు చెబుతారు. వేకువజామున లేచి తలంటుకుని స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి అర్ఘ్యం వదలాల్సి ఉంటుంది. అంటే ఈ పండుగ రోజుల్లో స్నానం చేయకపోతే కనుక 7 జన్మల పాటు రోగాల బారిన పడి నిర్ధనుడై జీవిస్తాడని శాస్త్రంలో చెప్పారు. కాబట్టి పవిత్రమైన సూర్య సంక్రమణం సమయంలో స్నానం చేయడం ఎంతో శుభప్రదం. ఈ పండుగ మూడు రోజులు ఎంత పని ఉన్నా ఎలా ఉన్నా స్నానం మాత్రం తప్పకుండా చేసి శుచిగా ఉండాలి. ముఖ్యంగా ఈ మూడు రోజులు తెల్లవారు జామున నిద్రలేచి సూర్యోదయం వేళ స్నానం చేసి సూర్య నమస్కారం చేస్తే ఎంతో పుణ్యప్రదం. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు, బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది. పంచభూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్యపదమని నమ్మకం. ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్ష్మజీవులను నశింపజేస్తుంది.

హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడించే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది. క్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారు జామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపస్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.

# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

- ఏపీలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భారీగా తరలిచ్చిన తెలుగు రాష్ట్రాల వీక్షకులు
- ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర నేతల రాకతో హడావిడి



**విజయవాడ, జనవరి 14 :** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమ య్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాట య్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపం దేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపం దేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదల య్యాయి. కైకలూరు మండలం భుజబ లపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటర మణ తిలకించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటు చేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

# 72 ఏళ్లకోమారు మారుతున్న సంక్రాంతి తేదీ

## 14 నుంచి 15కు మారడం వెనక భూ భ్రమణమే కారణం



**హైదరాబాద్, జనవరి 14 :** తెలుగు రాష్ట్రాలకు పెద్ద పండగ అంటే సంక్రాంతి. దేశవ్యాప్తంగా కూడా మకర సంక్రాంతిని జరుపుకుంటారు. దేశంలోని పలు ప్రాంతాలలో పొంగల్, లోహ్రీ, మాఘ బిహు, కిచ్డి వంటి వివిధ పేర్లతో పండుగ చేసుకుంటారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సందర్భంలో ఈ పండుగను చేసుకుంటారు. మకర సంక్రాంతి సౌర చక్రం ఆధారంగా ఉంటుంది. అందువల్ల, ఇది దాదాపు ప్రతి సంవత్సరం ఒకే తేదీన వస్తుంది. అయితే ఇటీవలి కాలంలో సంక్రాంతి పండుగ తేదీ మారింది. చాలా సంవత్సరాల పాటు జనవరి 14వ తేదీనే సంక్రాంతిని జరుపుకునే వాళ్లం. అయితే 2008 నుంచి మాత్రం జనవరి 15వ తేదీన సంక్రాంతిని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. దీని వెనుక ఓ ఆసక్తికర కారణం ఉందట. భూమి సూర్యుని చుట్టూ తిరిగే కక్ష్యలో వచ్చిన చిన్న మార్పు వల్లే సంక్రాంతి పండుగ జనవరి 14 నుంచి 15కు మారిందట. భూమి తన కక్ష్యలో తిరుగుతూ స్వల్పంగా దిశ మార్చుకోవడం వల్ల, సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయం కొద్దిగా మారుతుంది ప్రతి సంవత్సరం ఈ మార్పు సుమారు 20 నిమిషాలు ఉంటుంది. ఈ 20 నిమిషాల తేడా వల్ల, సుమారు 72 సంవత్సరాలకు ఒకసారి సంక్రాంతి తేదీ ఒక రోజు తర్వాతకు జరుగుతుంది అందుకే 1935 నుంచి 2007 వరకు జనవరి 14న ఉన్న సంక్రాంతి, 2008 నుంచి జనవరి 15కి మారింది. ఇలా 2080 సంవత్సరం వరకు జనవరి 15వ తేదీనే సంక్రాంతి వస్తుందట. 2081వ సంవత్సరం నుంచి మాత్రం సంక్రాంతి జనవరి 16కు మారుతుందట.



# మరోమారు రాజ్యసభకు నో

## దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన

**భోపాల్, జనవరి 14 :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.

# కామారెడ్డి జిల్లాలో దారుణ ఘటన

- 600 కుక్కలను హతమార్చి పాతిపెట్టిన సర్పంచ్‌లు
- జంతు ప్రేమికుల ఫిర్యాదుతో వెలికితీసి పోస్ట్‌మార్టమ్



**కామారెడ్డి, జనవరి 14 :** మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్ పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి గ్రామ పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్టే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# అమెరికాలో చేరేది లేదు

## గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్

**కోపెన్‌హాగెన్, జనవరి 14 :** అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. తరువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు. వారి సమస్యతో తాను విభేదిస్తున్నానని అన్నారు.

# పడిపోయిన టమోటా ధరలు

## మదనపల్లె మార్కెట్‌లో కిలో 25కే విక్రయం



**మదనపల్లె, జనవరి 14 :** మదనప్లలెలో కిలో టమోటా రూ.25కు పడిపోయాయి. మంగళ వారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌కు 90 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే వచ్చాయి. వాటిలో పది కిలోల మొదటి రకం టమోటాలు రూ.250, రెండో రకం రూ.230, మూడో రకం రూ.200లతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేశారని మార్కెట్ సెక్రటరీ జగదీష్ తెలిపారు. పదిరోజుల క్రితం కిలో టమోట రూ.50 పలుకగా, వారం రోజులుగా రేట్లు రోజు రోజుకు తగ్గు ముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కనీసం పంటలు వేసేందుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదని, ధరలు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయకుండా మానేయడమే మేలని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో ధరలు పతనం కాగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం టమోటా ధరలు అకాశాన్నంటు తుండడంతో వినియోగదారులు బేంబేలెత్తుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కిలో టమోటా రూ.50 పలుకుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఈ ధర మరింత ఎక్కువగా తీసుకుంటున్నారు. ఈ ధరలవల్ల పంట పండించే రైతు తీవ్రంగా నష్టపోతుండగా వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు బాట ధర కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి కోరుతున్నారు.

# కొత్తకొండ వీరన్న జాతర..
# ఆలయ ఆదాయానికి గండి

- దేవాదాయ శాఖ నిర్లక్ష్యంతో కబ్జాల కబంధంలో బ్రహ్మోత్సవాలు
- ఏక్ సాల్ పట్టాల ముసుగులో ఆలయ భూముల ఆక్రమణ
- ఎండోమెంట్స్ పర్యవేక్షణ ఎక్కడ?

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో వెలసిన ఉత్తర తెలంగాణ ప్రసిద్ధ పురాతన సేవా క్షేత్రమైన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజులపాటు జరగనున్న ఈ మహా జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు.







అయితే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నప్పటికీ జాతర నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు,స్థల పరిరక్షణలో దేవాదాయ శాఖ పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆలయానికి చెందిన భూములపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల అక్రమ నిర్మాణాలు పెరిగి బ్రహ్మోత్సవాల వైభవానికే తీవ్ర భంగం కలుగుతోంది.

### వీరన్న భూములపై పర్యవేక్షణ ఎవరిది?

ఒకప్పుడు జాతర సమయాల్లో సర్కస్‌లు, ఎగ్జిబిషన్ స్టాళ్లు, రంగుల రత్నాలు, ఆటవిడుపు కేంద్రాలతో కళకళలాడిన కొత్తకొండ వీరన్న జాతరో ప్రస్తుతం స్థలాభావంతో నీరసించిపోతోంది. దేవాలయం చుట్టూ ఉన్న దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో ఏక్ సాల్ పట్టాల పేరుతో ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దేవాలయ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత పూర్తిగా దేవాదాయ శాఖదే అయినప్పటికీ ఈ అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు గట్టి చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆలయ ఆస్తుల వివరాలు హద్దులు రికార్డులు స్పష్టంగా ఉండాల్సినప్పటికీ అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### దేవాదాయ శాఖ నిర్లక్ష్యమే జాతర అవ్యవస్థకు కారణమా?

ఆలయ భూములు క్రమంగా కబ్జాలకు గురవడంతో వాహనాల పార్కింగ్,భక్తుల విశ్రాంతి కేంద్రాలు, తాత్కాలిక దుకాణాల ఏర్పాట్లు అస్తవ్యస్తంగా మారాయి.ప్రతి ఏడాది జాతర సమయంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పరిస్థితిని చక్కదిద్దాల్సిన దేవాదాయ శాఖ ముందస్తు ప్రణాళికలు చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. భక్తుల భద్రత మౌలిక సౌకర్యాలు కల్పించడంలోనూ శాఖ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఆలయ ఆదాయానికి గండి.. ఎండోమెంట్స్ శాఖ బాధ్యత లేదా?


జాతర సమయంలో ఏర్పాటు చేసే సర్కస్‌లు,ఆటవిడుపు కేంద్రాలు, తాత్కాలిక దుకాణాల ద్వారా దేవాలయానికి గణనీయమైన ఆదాయం వచ్చేది. అయితే ఆలయ భూములు కబ్జాలకు గురవడంతో వాటికి సరైన స్థలం లేకుండా పోయింది.ఫలితంగా చాలా మంది వ్యాపారులు వెనుదిరుగుతున్నారు. దీంతో కొత్తకొండ వీరన్న దేవాలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాలయ ఆదాయం తగ్గిపోతున్నా దీనిపై దేవాదాయ శాఖ స్పందించకపోవడం భక్తుల్లో తీవ్ర అసహనానికి కారణమవుతోంది.

### ఎండోమెంట్స్ అధికారులపై చర్యలు ఉండయా?

లక్షలాది భక్తులు తరలివచ్చే ఈ పురాతన దేవాలయ భూములు ఇలా కబ్జాలకు గురవుతుంటే స్థానిక ఎండోమెంట్స్ అధికారులు, ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి నివేదికలు సమర్పించారన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ఆలయ ఆస్తుల పరిరక్షణలో విఫలమైన ఆలయ ఈవో సహా సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా? అన్నది ప్రశ్నగా నిలుస్తోంది.

ఇప్పటికైనా దేవాదాయ శాఖ ప్రత్యేకంగా స్పందించి ఆలయ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని అక్రమ నిర్మాణాలను తొలగించి దేవాలయ ఆస్తులను పరిరక్షించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. జాతర నిర్వహణకు శాశ్వతంగా విస్తృత స్థలాన్ని కేటాయించి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. కొత్తకొండ వీరన్న జాతరకు మళ్లీ పూర్వ వైభవం రావాలో దేవాదాయ శాఖ నిర్లక్ష్యానికి చెక్ పడాలో ఆలయ భూములు కాపాడాలి అన్నదే భక్తుల ఆకాంక్షగా మారింది.

---



## ఘనంగా శ్రీ గోదా రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్పల్లి గ్రామంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ గోదా రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, కూకట్ పల్లి సీనియర్ పాత్రికేయులు పరమేష్, తులసి రావు, శ్రీనివాస రావు పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని శ్రీ గోదా రంగనాయక స్వామి కృపకుపాత్రులైనారు.



## ఇస్సన్నపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఈసన్న పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ గ్రామ సర్పంచ్ దోకి లచ్చయ్య ప్రారంభించారు , అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆరు టీమ్స్ పాల్గొన్నాయి, ఫైనల్ మ్యాచ్లో ఈసన్నపల్లి, ఉప్పల్ వై గ్రామాలు తలపడగా ఇసన్నపల్లి ఫస్ట్ విజేతగా, ఉప్పల్ వై సెకండ్ విజేతగా నిలిచాయి, వారికి దోకి లచ్చయ్య బహుమతులు ప్రధానం చేశారు, ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.





## ధర్మవరంలో వీధి దీపాలు ఏర్పాటు

**వాజేడు,రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో ధర్మవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకా సుమతి ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. బుధవారం ప్రధాన రహదారితోపాటు,వీధులలో ఉన్న స్తంభాలకు గ్రామ సభ్యులు,గ్రామ పంచాయతీ సిబ్బందితో వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

---

## 18న ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

### ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు.బుధవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్,అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి పరిధిలో జరగనున్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల ప్రాంతాలను వారు సందర్శించారు.ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ మాట్లాడుతూ నర్సింగ్ కళాశాల సమీపంలో హెలీప్యాడ్‌ను డీజీసీఏ ప్రమాణాల మేరకు సిద్ధం చేయాలని,అక్కడ అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు.సీఎం కాన్వాయ్ కోసం అత్యుత్తమ వాహనాలను ఎంపిక చేయాలని, ప్రొటోకాల్ ప్రకారం ప్రత్యేక వైద్య బృందం, 108 వాహనాన్ని వెంట ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రికి వివరించేందుకు శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.



ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని జిల్లాలో పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీ సునీల్ దత్ పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ ఏ.శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

## ఐ-ప్యాక్ సంస్థపై ఈడీదాడులు

### హైకోర్టులో టిఎంసి పిటిషన్ తిరస్కరణ

**కోల్‌కతా, జనవరి 14 :** ఐ-ప్యాక్ సంస్థపై ఇటీవల జరిపిన దాడుల్లో తమ పార్టీ ఫైళ్లు, ఎన్నికలకు సంబంధించిన డేటాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సీజ్ చేసిందంటూ తృణమూల్ కాంగ్రెస్ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు బుధవారం నాడు డిస్పోజ్ చేసింది. సుప్రీంకోర్టులో ఇదే తరహా పిటిషన్ వేసినట్టు ఈడీ చెప్పడంతో ఆ సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈడీ వేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం గురువారం నాడు విచారణ జరుపనుంది. టీఎంసీకి సంబంధించిన ఎలాంటి డేటాను తాము సీజ్ చేయలేదని కోల్‌కతా హైకోర్టులో విచారణ సందర్భంగా ఈడీ తెలిపింది. కస్టడీలోకి తీసుకోని సామగ్రిని సురక్షితంగా ఉంచాలనడం ఏమిటని ప్రశ్నించింది. ఇది డేటా భద్రతకు సంబంధించిన అంశమే అయితే ఇందుకు సంబంధించిన విజ్ఞప్తిని తాము కట్టుబడి ఉంటామని, ఈడీ ఎలాంటి డేటాను స్వాధీనం చేసుకోలేదని, ఇందుకు భిన్నంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే ఆ డేటా తీసుకువెళ్లారని తెలిపింది. తమ తనిఖీలతో తృణమూల్ కాంగ్రెస్‌కు అసలు సంబంధమే లేదని వివరించింది. కాగా, ఎన్నికలకు సంబంధించిన తమ పార్టీ డేటాను ఈడీ సీజ్ చేసినందున ఆ డేటాకు భద్రత కల్పించాలని కోర్టును టీఎంసీ కోరింది.తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్త, ఐ-ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంపై ఈడీ ఇటీవల దాడులు జరిపింది. దీంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించిన పేపర్లు, పార్టీ ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన సమాచారం కలిగిన కంప్యూటర్ హార్డ్ డ్రైవ్‌లు, కీలకమైన డిజిటల్ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఈడీ ప్రయత్నించినట్టు ఆమె ఆరోపించారు. మమతా బెనర్జీ చర్యను బీజేపీ తీవ్రంగా ఖండించింది. లీగల్ ఇన్వెస్టిగేషన్‌ను రాజకీయ అంశంగా చేసుకుని రాజ్యాంగ సంస్థలు, చట్టబద్ధ పాలనను బలహీన పరిచేందుకు సీఎం ప్రయత్నించినట్టు ఆరోపించింది. దర్యాప్తు సంస్థల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఎలాంటి చర్యలనైనా తాము తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. ఇలాంటి చర్యల వల్ల సంస్థల విశ్వసనీయతకు భంగం కలుగుతుందని పేర్కొంది.

---





## తెలంగాణ రాష్ట్ర ఓడబలిజ సేవా సంఘం యూత్ అధ్యక్షులుగా బొల్లె ఆదినారాయణ ఎంపిక

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో ధర్మారం గ్రామంలో ఓడబలిజ కులస్తులు బుధవారం ముఖ్య సమావేశం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గగ్గురి రమణయ్య,ఉప సర్పంచ్ సూర్యం,అల్లి సూరిబాబు,కోశాధికారి సురేష్ పలువురు ఓడబలిజ కులస్తులు తెలంగాణ రాష్ట్ర ఓడబలిజ సేవా సంఘం యూత్ అధ్యక్షులుగా బొల్లె ఆదినారాయణ ఎంపిక చేసి,వారిని శాలువాతో సన్మానించారు.వారు మాట్లాడుతూ..ఓడబలిజ కులస్తులకు ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో వాజేడు మండల అధ్యక్షులు నాగార్జున్, దేవా, శ్రీరాములు, ఆదినారాయణ, ఉపాధ్యక్షులు తూనూరి రఘుబాబు,మహేష్,నరేష్, నవీన్ అశోక్,సాయి,లక్ష్మణ్,శివకృష్ణ, కార్తీక్, ఓడ బలిజ తదితరులు పాల్గొన్నారు.

---

## చనిపోయిందనుకున్న బామ్మ లేచింది

### బర్త్‌డే వేడుకగా మారిన అంత్యక్రియల ఘట్టం

**నాగపూర్,జనవరి14 :** ఒక్కోసారి అనూహ్య ఘటనలె, అద్భుతాలు జరుగుతుంటాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇలాంటి అనూహ్య ఘటన చోటుచేసుకుంది. చనిపోయిందనుకున్న బామ్మ బతికింది. అందరిలోనూ ఆశ్చర్యంతో పాటు, ఆనందం కూడా కలిగింది. అదేరోజు బామ్మ బర్త్‌డే కావడంతో చావుకు వచ్చిన వారంతా కేక్ కట్ చేసి బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే...నగరానికి చెందిన 103 ఏళ్ల వృద్ధురాలు గంగాబాయి సఖారే కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం ఆమె మరణించినట్టు కుటుంబసభ్యులు నిర్ధారించుకున్నారు. చివరి చూపు కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా..వృద్ధురాలి కాలి వేలు కదలడాన్ని ఆమె మనవడు రాకేష్ సఖారే గమనించాడు. వెంటనే అక్కడి వారికి విషయం చెప్పడంతో ఆమె ముక్కులో ఉన్న దూదిని తొలగించగా వృద్ధురాలు శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. దీంతో చనిపోయిందనుకున్న గంగాబాయి బతికే ఉన్నందుకు కుటుంబసభ్యులు సంతోషపడ్డారు. వైద్యులు కూడా ఆమెను పరీక్షించి..ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా అదే రోజు గంగాబాయి 103వ పుట్టిన రోజు కూడా కావడంతో వేడుకలను కుటుంబసభ్యులు ఘనంగా జరిపారు. అంతసేపు బాధలో ఉన్న బంధువులంతా బర్త్‌డే కేక్ తిని ఆనందంగా తమ ఇళ్లకు వెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది.



## అలా చేస్తే.. గ్రీన్‌లాండ్‌కే సమస్య

### ట్రంప్ హెచ్చరిక

**గ్రీన్‌లాండ్ :** గ్రీన్‌లాండ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. అగ్రరాజ్యంలోకి చేరబోమని, డెన్మార్క్‌లోనే ఉంటామని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ ప్రకటించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "అది అతడి సమస్య. నీల్సన్ అభిప్రాయంతో ఏకీభవించట్లేదు. అతడి గురించి నాకు సరిగా తెలియదు. కానీ డెన్మార్క్‌లోనే కొనసాగాలనుకుంటే అది గ్రీన్‌లాండ్‌కే పెను సమస్యగా మారుతుంది" అని ట్రంప్ హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌కు ఏవైనా ఆఫర్లు ప్రకటించారా? అని మీడియా ప్రశ్నించగా.. అలాంటిదేమి లేదని బదులిచ్చారు. "గ్రీన్‌లాండ్ తప్పకుండా అమెరికా భూభాగంలో చేరాలి. లేదంటే ఆ ప్రాంతాన్ని రష్యా, చైనా ఆక్రమిస్తాయి. ఇప్పటికే ఆ దేశాల రక్షణ బలగాలు అక్కడ పాగా వేశాయి. నేను తలుచుకుంటే అక్కడ అధిక సంఖ్యలో మా సైన్యాన్ని మోహరించగలను. గ్రీన్‌లాండ్‌లో అమెరికా జెండా ఎగరాలి" అని ట్రంప్ పేర్కొన్నారు.




## రైలుపై జారిపడిన క్రేన్..

### 29 మంది మృతి

**బ్యాంకాక్:** థయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదులుతున్న రైలుపై ఓ క్రేన్ జారిపడటంతో బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో 29 మంది మృతి చెందినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ నిర్మాణ పనుల్లో ఉన్న ఓ క్రేన్ అదుపుతప్పి ఒక్కసారిగా కింద పడింది. అదే సమయంలో కింద ఉన్న పట్టాలపై నుంచి ఓ ప్రయాణికుల రైలు వెళ్తోంది. క్రేన్ పడటంతో ఆ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో మంటలు చెలరేగాయి. ఈ సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 29 మంది మృతిచెందగా.. మరో 60 మందికి పైగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బోగీల్లో చిక్కుకున్న వారిని వెలికితీస్తున్నట్లు తెలిపారు. రైలు బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాచథని ప్రావిన్స్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రైలుకు మొత్తం 3 బోగీలు ఉండగా.. చివరి రెండు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో రైల్లో 195 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## 'డిజిటల్ ఐడీ'లపై వెనక్కి తగ్గిన బ్రిటన్



**బ్రిటన్ :** దేశంలో వలసలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలకు డిజిటల్ ఐడీలు దోహదపడతాయని భావించిన బ్రిటన్.. తాజాగా ఈ ప్రణాళికపై వెనక్కి తగ్గింది. దేశంలో ఉద్యోగం పొందడానికి డిజిటల్ ఐడీ కార్డు తప్పనిసరి కాదని పేర్కొంది. ఈ విధానంపై ప్రతిపక్షాలతోపాటు అధికార పక్షం నుంచీ విమర్శలు రావడంతో యూకే ప్రధాని కీర్ స్టార్మర్ దీనిపై యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. బ్రిటన్ పౌరులు, నివాసితులు దేశంలో పనిచేయాలంటే డిజిటల్ ఐడీ కార్డులు ఉండాలని ప్రధాని కీర్ స్టార్మర్ గతంలో స్పష్టం చేశారు. దేశంలో అక్రమ వలసలను నియంత్రించడంలో దోహదపడుతుందని గత సెప్టెంబర్‌లో పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం, చిన్నారుల రక్షణతోపాటు ప్రభుత్వ సర్వీసులను మరింత సులభతరం చేస్తుందన్నారు. ఈ క్రమంలో భారత్‌లోని 'ఆధార్' వ్యవస్థ గురించి తెలుసుకునేందుకు స్టార్మర్ ఆసక్తి చూపారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సామాన్య పౌరులకు ఈ తరహా డిజిటల్ ఐడీ కార్డులను బ్రిటన్ తప్పనిసరి చేయలేదు. ఈ అంశం దశాబ్దాలుగా వివాదాస్పదంగానే ఉంది. మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కూడా వీటిని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. ఉగ్రవాదంపై పోరు, మోసాలను నియంత్రించడానికి ఇదో మార్గమని అప్పట్లో ఆయన చెప్పారు. కానీ, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడంతోపాటు వారి సమాచారానికి ముప్పు ఏర్పడుతుందని పౌర హక్కుల కార్యకర్తల వాదనతో ఆయా ప్రభుత్వాలు వెనకడుగు వేస్తున్నాయి.

# ఇరాన్‌లో మారణహోమం

### 2,571కి పెరిగిన మృతులు



**దుబాయ్ :** ఆర్థిక సంక్షోభంతో ఇరాన్‌లో మొదలైన ఆందోళనలు మారణహోమంగా మారాయి. ఆందోళనకారులను అణచివేసే క్రమంలో ఆ దేశంలో భారీ విధ్వంసమే చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని వారాలుగా జరుగుతున్న ఈ ఘర్షణల్లో మృతుల సంఖ్య వేలల్లో ఉన్నట్లు తెలియడం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఇరాన్ ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మృతి చెందినట్లు అమెరికా కేంద్రంగా పని చేసే మానవ హక్కుల ఉద్యమకారుల వార్తా సంస్థ బుధవారం వెల్లడించింది. వీరిలో 2,403 మంది ఆందోళనకారులు కాగా.. 147 మంది భద్రతా సిబ్బంది, ప్రభుత్వానికి చెందినవారు ఉన్నట్లు తెలుస్తోంది. ఆందోళనలతో సంబంధం లేని 12 మంది చిన్నారులు, 9 మంది పౌరులు చనిపోయినట్లు సదరు సంస్థ పేర్కొంది. ఇప్పటివరకు 18,000 మందికి పైగా నిరసనకారులను భద్రతాధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఘర్షణల్లో మరణాల సంఖ్య మరింత పెరగవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనల నేపథ్యంలో ఇరాన్‌లో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో కమ్యూనికేషన్ కోసం శాటిలైట్ ఇంటర్నెట్ ప్రొవైడర్ స్టార్‌లింక్ ఉచిత సేవలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మానవ హక్కుల సంఘాలు వెల్లడించగా.. స్టార్‌లింక్ మాత్రం ఇంకా ధ్రువీకరించలేదు.

## 'ఇరాన్‌ను వీడండి'.. భారతీయులకు విదేశాంగశాఖ సూచన

ఇరాన్‌లో ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో.. అక్కడి భారత రాయబార కార్యాలయం ఆ దేశంలో ఉంటున్న మన పౌరులను అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచిందింది. మరోవైపు భారత విదేశాంగశాఖ సైతం.. తదుపరి నోటీసు ఇచ్చేవరకు ఆ దేశానికి ప్రయాణించొద్దని సూచించింది. "స్థానికంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఇరాన్‌లోని భారత పౌరులు, భారత సంతతికి చెందినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆందోళనలు, ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలి. భారత పౌరులు తమ పాస్‌పోర్ట్‌లు, గుర్తింపు కార్డులు సహా ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఎంబసీలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలి" అని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ఇప్పటివరకు 2500 మందికిపైగా మృతి చెందారు. మరోవైపు.. నిరసన లు కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగశాఖ ఇప్పటికే ఓసారి పౌరులను అప్రమత్తం చేసింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను మానుకోవాలని తెలిపింది.

## ఆరోపణలు సులువే.. ఆధారాలెక్కడ?

### కెనడాపై భారత రాయబారి ఫైర్



**కెనడా :** ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా 40 ఏళ్లుగా విఫలమవుతూనే ఉందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ అన్నారు. అందువల్లే భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని విమర్శించారు. కెనడా మీడియా సంస్థ సీబీసీకి దినేశ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటన ప్రస్తావనకు రాగా.. ఈ కేసులో భారత్‌పై కెనడా ఆరోపణలను ఆయన మరోసారి తిప్పికొట్టారు. "కెనడా గడ్డ నుంచి జరు గుతోన్న ఉగ్ర కుట్రల గురించి మేం 40 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. ఉగ్రవాద కట్టడికి ఈ దేశ నేతలెవరైనా చర్యలు చేపట్టారా? ఈ కేసుల్లో (ఎయిరిండియాపై బాంబు దాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ) కనీసం ఒక్కరికైనా శిక్ష పడిందా? కెనడా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఉగ్రవాదుల గురించి భారత్ లేవనెత్తినప్పుడు ఆధారాలు కావాలని డిమాండ్ చేస్తోంది. మరి మా దేశంపై కెనడా ఆరో పణలు చేసినప్పుడు కూడా (నిజ్జర్ హత్య కేసు విషయంలో) ఆధారాలు చూపించాలి కదా. ఆరోపణలు చేయడం సులువే. ఆ ఘటనలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని చెప్పేందుకు కచ్చితమైన సమాచారం ఉందని పదే పదే చెబుతోంది. మరి అందుకు తగిన ఆధారాలెక్కడ?" అని భారత రాయబారి ప్రశ్నించారు. నిజ్జర్ హత్య కేసుకు సంబంధించి కెనడాలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదైందని, ఇప్పటివరకు భారత ప్రభుత్వంపై ఎలాంటి అభియోగాలు లేవని దినేశ్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందంటూ గతంలో కెనడా చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య విభేదాలు రాజుకున్న సంగతి తెలిసిందే.




## భాజపాతో జట్టుకట్టే ప్రసక్తే లేదు : టీవీకే

**తమిళనాడు :** విజయ్ పార్టీని ఎన్డీయేలోకి బలవంతంగా చేర్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే ఆయన నటించిన 'జన నాయగన్' చిత్రానికి సకాలంలో సెన్సార్ సర్టిఫికెట్ లభించకుండా కేంద్రం అడ్డుపడుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పొత్తుపై తమిళగ వెట్రి కళగం స్పందించింది. రాజకీయంగా తమను అడ్డుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎన్డీఏతో జట్టు కట్టే ప్రసక్తే లేదని టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ స్పష్టంచేశారు. టీవీకేను కూల్చడానికి ఎన్ని కుట్రలు పన్నినా తమ పార్టీ సిద్ధాంత వైఖరిలో ఎటువంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. టీవీకేకు భాజపా సిద్ధాంత శత్రువు అయితే డీఎంకే రాజకీయ శత్రువని అన్నారు. 'జన నాయగన్' సినిమా వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పందనను స్వాగతిస్తున్నట్లు నిర్మల్ కుమార్ తెలిపారు. దీనిని తమ పార్టీకి కాంగ్రెస్ ఇస్తున్న స్నేహపూర్వక మద్దతుగా భావిస్తున్నట్లు వెల్లడించారు. అయితే ఆ పార్టీతో పొత్తు విషయంపై తమ పార్టీ అధినేత విజయ్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారన్నారు. మరోవైపు కరూర్ జిల్లా తొక్కిసలాట దుర్ఘటన వ్యవహారం లోనూ విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు జారీ చేయడంతో.. ఆయనను ఇరకాటంలో పెట్టి పొత్తుకు ఒప్పించడానికి భాజపా యత్నిస్తోందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

## స్మార్ట్‌ఫోన్ ప్రియులకు ధరల షాక్..


### బాంబు పేల్చిన నథింగ్ సీఈఓ



**న్యూఢిల్లీ :** ఒకప్పుడు రూ.10వేల ధరలో 10 ఎంపీ కెమెరా.. 2 జీబీ ర్యామ్‌తో స్మార్ట్‌ఫోనంటే గొప్ప విషయం. ఇప్పుడు అదే రూ.10 వేల ధరలో 50 ఎంపీ కెమెరా, 6000 ఎంఏహెచ్ బ్యాటరీతో ఫోన్లు వచ్చేస్తున్నాయి. పైగా డిస్‌ప్లే సైతం మెరుగవుతోంది. కొత్త ఫీచర్లు యాడ్ అవుతున్నాయి. హార్డ్‌వేర్ ధరలు ఏటికేడు తగ్గుతుండడంతో ధరలు పెంచకుండా మెరుగైన ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్లను అందిస్తూ వస్తున్నాయి కంపెనీలు. ఈ పరిస్థితి ఇకపై ఉండకపోవచ్చు అంటున్నారు నథింగ్ సీఈఓ కార్ల్ పై. 2026లో మునుపటిలా తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్‌లు లభించే అవకాశం ఉండబోదని, మెరుగైన స్పెసిఫికేషన్స్‌తో స్మార్ట్‌ఫోన్ కావాలంటే అధిక ధర చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు

## కెనడాలో భారతీయుడి హత్య

**కెనడా :** కెనడాలో ఓ భారతీయుడు హత్యకు గురయ్యాడు. సర్రే నగరంలో మంగళవారం మధ్యాహ్నం పంజాబ్‌కు చెందిన వ్యాపారవేత్త (్రాబఅయిఖఎఱ దీబంఱఅవంంఋఖఅ) బిందర్ గర్చా (48) తన ఇంటికి కొంత దూరంలో తీవ్ర గాయాలతో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడు బుల్లెట్ గాయాలతో ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. బిందర్ కొన్నేళ్లుగా కెనడాలోనే నివాసం ఉంటూ స్టూడియో-12 పేరుతో ఫొటో స్టూడియో నడుపుతున్నట్లు తెలిపారు. అయితే ఈ హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాల్పులకు తెగబడిన దుండగులు వాడినదిగా భావిస్తున్న కాలిపోయిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.



## టారిఫ్‌లు ఆపితే నా దారులు నాకున్నాయ్

### సుప్రీం తీర్పునకు ముందు ట్రంప్

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానాలపై అక్కడి సుప్రీంకోర్టు నేడు తీర్పు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. ఒకవేళ తాను విధించిన సుంకాలను న్యాయస్థానం అడ్డుకుంటే.. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతామని ఆయన వెల్లడించారు. "చైనా ప్రయోజనాలకు మద్దతు కల్పించే ఉద్దేశంతోనే కొందరు ఈ టారిఫ్‌లను సవాల్ చేస్తూ కేసులు వేశారు. ఒకవేళ కోర్టు సుంకాలను వ్యతిరేకిస్తే మా ప్రభుత్వం కచ్చితంగా ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషిస్తుంది. నేను విధించిన టారిఫ్‌ల వల్ల తక్కువ సమయంలోనే ఫెడరల్ బడ్జెట్ ద్రవ్యలోటు 27శాతం వరకు తగ్గింది. ఈ సుంకాల వల్ల అమెరికాలో వినిమయ ఖర్చులు పెరిగాయని విమర్శకులు అంటున్నారు. అది నిజం కాదు. ఈ టారిఫ్‌లను విదేశాలే చెల్లిస్తున్నాయి. అమెరికాలోని కొనుగోలుదారులకు ఎలాంటి సమస్యా ఉండదు. ఈ విషయంలో నేను తీసుకున్న నిర్ణయం సరైందే" అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే పలు దేశాలపై సుంకాల బాదుడు మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా న్యాయస్థానాల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అగ్రరాజ్య సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. దీనిపై న్యాయస్థానం బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) తీర్పు వెలువరించనుంది. టారిఫ్‌ల విషయం లో ట్రంప్ అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని అతిక్రమిం చారా? లేదా? అనేది కోర్టు నిర్ణయించనుంది. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా ట్రంప్ వరుసగా పోస్టులు పెడుతున్నారు. తాను విధించిన సుంకాలను సుప్రీంకోర్టు కొట్టేస్తే తీవ్ర ఇబ్బందుల్లో ఇరుక్కుంటామని, ఇప్పటివరకు వసూలు చేసిన సుంకాలను తిరిగి చెల్లించడం అసాధ్యమని ఆయన అన్నారు.



## శబరిమలలో మకరజ్యోతి దర్శనం

### పులకించిన భక్తజనం

**శబరిమల:** హరిహరక్షేత్రం శబరిమల 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయానికి ఈశాన్య దిశలో పర్వతశ్రేణుల నుంచి వెలుగులీనుతున్న జ్యోతి దర్శనమిచ్చింది. జ్యోతి దర్శనంతో వేలాది మంది భక్తులు పులకించిపోయారు. హరిహర సుతుడైన స్వామి అయ్యప్పను స్మరిస్తూ స్వామియే శరణం అయ్యప్ప అన్న శరణుఘోషలతో శబరిగిరులు ప్రతిధ్వనించాయి. కాంతమాల కొండలపై దేవతలు, రుషులు కలిసి భగవంతునికి హారతి ఇస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతకుముందు పందాళం నుంచి తీసుకువచ్చిన తిరువాభరణాలను ప్రధాన అర్చకులు స్వామివారికి అలంకరించారు. అనంతరం మూలమూర్తికి హారతి నిచ్చారు. ఆ వెంటనే క్షణాల్లో చీకట్లను తొలగిస్తూ పొన్నాంబలంమేడు పర్వత శిఖరాల్లో జ్యోతి దర్శనమైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు శబరిమలకు భారీగా తరలివచ్చారు.





## ప్రయత్నాలు విఫలమైనా.. డీకే శివకుమార్ పోస్ట్‌కు అర్థమేంటీ?


**బెంగళూరు :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కర్ణాటక పర్యటనతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై మరోసారి జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల వేళ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన పోస్ట్ మరింత చర్చనీయాంశంగా మారింది. 'ప్రయత్నాలు విఫలమైనా.. ప్రార్థనలు ఎన్నటికీ విఫలం కావు' అంటూ డీకే తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. దీంతో సీఎం మార్పుపైనే ఆయన పరోక్షంగా మాట్లాడారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. రాహుల్ గాంధీ మంగళవారం మైసూరులో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితర నేతలతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. రాష్ట్రంలో అధికార పంపిణీ వ్యవహారంపై వీరు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పష్టతనివ్వాలని ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య.. రాహుల్ గాంధీని కోరినట్లు సమాచారం. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారని అప్పట్లో వార్తలూ వచ్చాయి. అయితే, ఈ ఊహాగానాలను ఖండిస్తూ ఐదేళ్లూ తానే సీఎంగా ఉంటానని సిద్ధరామయ్య పలుమార్లు స్పష్టం చేశారు. అదే సమయంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే ఆశ తనకు ఉందనే అర్థం వచ్చేలా డీకే కూడా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# '10 మినిట్స్ డెలివరీ' తొలగించిన స్విగ్గీ, జెప్టో




క్విక్ కామర్స్ సంస్థలైన స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో '10 మినిట్స్ డెలివరీ' బ్రాండింగ్‌ను నిలిపివేశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్లింకిట్ మంగళవారం తొలుత ఈ నిర్ణయం తీసుకోగా.. బుధవారం ఈ రెండు సంస్థలూ '10 నిమిషాల్లో డెలివరీ' ప్రకటనను ఆపివేశాయి. త్వరితగతిన డెలివరీ పేరుతో డెలివరీ ఏజెంట్లపై ఒత్తిడి తెస్తున్నారంటూ గిగ్ వర్కర్ల నుంచి ఇటీవల ఆందోళనలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ.. బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. డెలివరీ కార్మికుల సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి హామీ ఇవ్వొద్దని ఆయా సంస్థలకు స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో '10 నిమిషాల డెలివరీ' ప్రకటనను తొలగింపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయి. అయితే, బ్రాండింగ్ మారుతుందే తప్ప.. కస్టమర్లకు క్విక్ డెలివరీలు మాత్రం ఎప్పటిలానే కొనసాగుతాయి. 10 నిమిషాల నిబంధన తొలగించడం వల్ల డెలివరీ ఏజెంట్లపై ఆ మేర ఒత్తిడి తగ్గుతుంది. గిగ్‌కార్మికుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ స్వాగతించింది.



## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఒడుదొడుల అనంతరం నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, రియల్టీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. భౌగోళిక రాజకీయ పరిణామాలు, భారత్– అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతుండడం మన మార్కెట్లపై ప్రభావం చూపింది. దీంతో వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. మహారాష్ట్రలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గురువారం (జనవరి 15) బీఎస్ఈ, ఎన్ఎస్ఈ పనిచేయవు. తిరిగి శుక్రవారం మార్కెట్లు తెరుచుకోనున్నాయి. సెన్సెక్స్ ఉదయం 83,358.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,627.69) నష్టాల్లో ప్రారంభమైంది. మధ్యలో కాసేపు లాభాల్లోకి వచ్చినా ఎంతోసేపు నిలవలేదు. ఇంట్రాడేలో 83,185.20 – 83,809.98 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 244.98 పాయింట్ల నష్టంతో 83,382.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 66.70 పాయింట్ల నష్టంతో 25,665.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.31గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, సన్‌ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటెర్నల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4,636 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




## సరికొత్త గరిష్ఠాలకు బంగారం, వెండి ధరలు

భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఎన్నడూలేని రీతిలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతూ దూసుకెళుతున్నాయి. ఫ్యూచర్ మార్కెట్‌లో కిలో వెండి ధర మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఒక్క రోజులోనే రూ.12,803 పెరిగి రూ.2.87 లక్షలకు చేరింది. బంగారం సైతం 10 గ్రాములు రూ.1.43 లక్షల వద్ద ట్రేడవుతోంది. గత నాలుగు రోజుల్లోనే వెండి ధర రూ.35 వేలు మేర పెరిగింది. ఈ ఏడాదిలో (2026) ఇప్పటివరకు రూ.52 వేలు పెరగడం గమనార్హం. గతేడాది డిసెంబర్ 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉంది. ఇక బంగారం సైతం ఫ్యూచర్ మార్కెట్‌లో ఫిబ్రవరి కాంట్రాక్ట్ ఒక్క రోజులో రూ.932 పెరిగి రూ.1.43 లక్షల వల్ల సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో (స్పాట్ గోల్డ్) 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,600 పలుకుతుండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,650గా ఉంది. కిలో వెండి ధర రూ.2,88,300 ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ విపణిలో ప్రస్తుతం బంగారం ఔన్సు 4,638.75 వద్ద ట్రేడవుతుండగా, వెండి 90 డాలర్ల ఎగువన కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.20గా ఉంది. రూపాయి విలువ క్షీణత కూడా దేశీయ బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతోంది.

### కారణాలు ఇవీ..

తాజాగా విడుదలైన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచనాలను పెంచాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి పేర్కొన్నారు. ఈ అంచనాలు బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమయ్యాయని తెలిపారు. కమొడిటీ ఎక్స్ఛేంజీలో వెండి ఔన్సు తొలిసారి 91 డాలర్ల మార్కును చేరుకుందన్నారు. దీనికితోడు భౌగోళిక ఉద్రిక్తతలు కూడా మరో కారణమని తెలిపారు. ఇరాన్‌లోని పౌరుల ఆందోళనలు, ఉక్రెయిన్– రష్యా మధ్య కొనసాగుతున్న దాడుల కారణంగా సురక్షిత పెట్టుబడి సాధనాలుగా భావించి బంగారం, వెండిపై పెట్టుబడులు కుమ్మరిస్తుండడంతో వీటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

# మిచెల్, విల్ యంగ్ మెరుపులు

## రెండో వన్డేలో న్యూజిలాండ్ విజయం

### రాహుల్ శతకం వృథ

**రాజ్‌కోట్:** రాజ్‌కోట్‌లోనే సిరీస్‌ను చేజిక్కించుకోవాలన్న టీమ్‌ఇండియా ఆశ నెరవేరలేదు. మందకొడి పిచ్‌పై మన కన్నా మెరుగ్గా బ్యాటింగ్, బౌలింగ్ చేసిన కివీస్.. రెండో వన్డేలో పైచేయి సాధించింది. బంతితో భారత్‌కు కళ్లెం వేసిన కివీస్.. మిచెల్ అద్భుత శతకంతో తడబాటు లేకుండా లక్ష్యాన్ని ఛేదించేసింది. రాహుల్ శతకం వృథ అయింది. భారత్‌కు భంగపాటు. డరిల్ మిచెల్ (131 నాటౌట్; 117 బంతుల్లో 11(4), 2(6)) అదిరే శతకం సాధించడంతో రెండో వన్డేలో 7 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించిన కివీస్.. 1–1తో సిరీస్‌ను సమం చేసింది. కేఎల్ రాహుల్ (112 నాటౌట్; 92 బంతుల్లో 11(4), 1(6)) శతకం బాదడంతో బుధవారం మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (56; 53 బంతుల్లో 9(4), 1(6)) రాణించాడు. ఆ తర్వాత భారత బౌలర్లు రాణించలేకపోయారు. మిచెల్‌తో పాటు విల్ యంగ్ (87; 98 బంతుల్లో 7(4)) సత్తా చాటడంతో లక్ష్యాన్ని న్యూజిలాండ్ 47.3 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. భారత్‌లో కివీస్‌కు ఇది అత్యధిక లక్ష్యఛేదన. నిర్ణయాత్మక మూడో వన్డే ఆదివారం జరుగుతుంది.





**నిలిచిన ఆ ఇద్దరు..:** ఛేదనలో సూపర్ శతకం సాధించిన మిచెల్.. విల్ యంగ్‌తో అద్భుత భాగస్వామ్యంతో కివీస్‌ను విజయపథంలో నడిపించాడు. ఆరంభంలో మెరుగ్గానే బౌలింగ్ చేసిన భారత బౌలర్లు ఆ తర్వాత ప్రభావం చూపలేకపోయారు. ముఖ్యంగా మధ్య ఓవర్లలో వికెట్ల వేటలో విఫలం కావడం భారత్‌ను దెబ్బతీసింది. అయితే భారత్‌లాగే ఆరంభంలో కివీస్ కూడా కష్టపడింది. సిరాజ్, హర్షిత్ రాణా అత్యంత కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టుకు కళ్లెం వేశారు. ఆరో ఓవర్లో కాన్వే (16; 21 బంతుల్లో 3(4))ను హర్షిత్ చేసేటప్పటికి స్కోరు 22 పరుగులే. పరుగుల కోసం చెమటోడ్చిన నికోల్స్ (24 బంతుల్లో 10) 13వ ఓవర్లో, జట్టు స్కోరు 46 వద్ద వెనుదిరిగాడు. ఆ తర్వాత మిచెల్, యంగ్ చక్కని బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నిర్మించారు. స్ట్రైక్‌రొటేట్ చేస్తూ, వీలైనప్పుడు బంతిని బౌండరీకి తరలించారు. భారత బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఈ భాగస్వామ్యాన్ని విడదీయలేకపోయారు. ఇద్దరిలో మిచెల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. మంచి స్వీప్ షాట్లు ఆడాడు. అతడు 52 బంతుల్లో, యంగ్ 68 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. 36వ ఓవర్లో స్కోరు 200లకు చేరుకుంది. కాసేపటికే యంగ్‌ను ఔట్ చేయడం ద్వారా 162 పరుగుల భాగస్వామ్యాన్ని కుల్‌దీప్ విడదీసినా భారత్‌కు పెద్దగా ఉపయోగం లేకపోయింది. ఆ నిష్క్రమణ మిచెల్‌పై ఎలాంటి ఒత్తిడినీ పెంచలేదు. చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన అతడు.. ఫిలిప్స్ (32 నాటౌట్; 25 బంతుల్లో 2x4, 1x6) పరుగుల వేటను కొనసాగించాడు. ఫిలిప్స్ కూడా అలవోకగా బ్యాటింగ్ చేయడంతో ఎలాంటి నాటకీయతకు అవకాశం లేకుండా కివీస్ లక్ష్యాన్ని అందుకుంది. వన్డేల్లో ఎనిమిదో శతకం సాధించిన మిచెల్.. ఫిలిప్స్‌తో అభేద్యమైన నాలుగో వికెట్‌కు 57 బంతుల్లో 78 పరుగులు జోడించాడు. 80 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ప్రసిద్ధ్ క్యాచ్ వదిలేయడం మిచెల్‌కు కలిసొచ్చింది. భారత స్పిన్నర్లు జడేజా, కుల్‌దీప్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నిరాశపరిచారు. కుల్‌దీప్ ఏకంగా 82 పరుగులిచ్చాడు. మన స్పిన్నర్ల కన్నా కివీస్ అరంగేట్ర స్పిన్నర్ లెనాక్స్ (1/42) మెరుగ్గా బౌలింగ్ చేశాడు.

**నిలిచిన రాహుల్:** మందకొడి పిచ్‌పై భారత్ 284 పరుగులు చేసిందంటే కారణం కేఎల్ రాహుల్ పోరాటమే. రోహిత్ (24), కోహ్లి (23) పెద్ద స్కోర్లు చేయకున్నా, శ్రేయస్ (8) విఫలమైనా అతడు అద్భుత శతకంతో జట్టును నిలబెట్టాడు. కీలక భాగస్వామ్యాలతో కివీస్‌ను అడ్డుకున్నాడు. టాస్ ఓడి భారత బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు రోహిత్, శుభ్‌మన్ గిల్ ఆరంభంలో అతి జాగ్రత్తగా ఆడారు. కివీస్ పేసర్లు జేమీసన్, ఫౌక్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఓపెనర్లు పరుగుల కోసం కష్టపడ్డారు. 5 ఓవర్లకు స్కోరు 10 పరుగులే. జేమీసన్ తొలి రెండు ఓవర్లు మెయిడిన్లే కావడం గమనార్హం. రోహిత్ శర్మ తాను ఎదుర్కొన్న 11వ బంతికి కానీ ఖాతా తెరవలేకపోయాడు. కానీ ఆరో ఓవర్ నుంచి పరిస్థితి మారిపోయింది. ఆరంభ ఇబ్బందిని అధిగమిస్తూ రోహిత్, గిల్ ఇద్దరూ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించడంతో భారత్ 12 ఓవర్లలో 70/0తో మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ అనూహ్యంగా తడబడింది. కొద్ది వ్యవధిలోనే నాలుగు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. క్లార్క్ బౌలింగ్‌లో కవర్ మీదుగా భారీ షాట్ ఆడబోయిన రోహిత్ యంగ్‌కు చిక్కాడు. ఆ తర్వాత కెప్టెన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (17 బంతుల్లో 8) మిస్ హిట్లతో వెనుదిరిగారు. జేమీసన్ స్లో షార్ట్ బాల్‌ను పుల్ చేయబోయిన గిల్.. మిడ్‌వికెట్లో మిచెల్‌కు చిక్కాడు. నిలదొక్కుకోవడానికి సమయం తీసుకున్న శ్రేయస్.. క్లార్క్‌లో బౌలింగ్ నేరుగా మిడాన్‌లో బ్రాస్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. బౌండరీతో ఖాతా తెరిచిన కోహ్లి.. కుదురుకుంటున్న దశలో వెనుదిరిగాడు. మరోవైపు నుంచి బ్యాటర్లు ఔట్ కావడం అతడి లయను దెబ్బతీసినట్లుంది. క్లార్క్ బౌలింగ్‌లో ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో అతడు బౌల్డ్ కావడంతో టీమ్‌ఇండియా 118/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో పట్టుదలగా నిలిచిన రాహుల్, బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. పరుగుల వేగం తగ్గినా.. జడేజా (27)తో అయిదో వికెట్‌కు 73 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 39వ ఓవర్లో జడేజా నిష్క్రమించాక నితీశ్ కుమార్‌రెడ్డి (20)తో రాహుల్ మరో విలువైన భాగస్వామ్యాన్ని (57) నెలకొల్పాడు. 47వ ఓవర్లో నితీశ్ ఔటయ్యేటప్పటికి భారత్ స్కోరు 248. హర్షిత్ రాణా (2) కూడా వెంటనే ఔటైనా.. రాహుల్ చెలరేగడంతో ఆఖరి రెండు ఓవర్లలో భారత్ 26 పరుగులు రాబట్టింది. జేమీసన్ బౌలింగ్‌లో సిక్స్‌తో రాహుల్ సెంచరీ పూర్తి చేశాడు. చివరి 10 ఓవర్లలో టీమ్‌ఇండియా 85 పరుగులు చేసింది.

## ఆయుష్ బడోని ఎంపిక సరికాదు

### కృష్ణమాచారి శ్రీకాంత్



వడోదర వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి వన్డేలో వాషింగ్టన్ సుందర్ గాయపడిన విషయం తెలిసిందే. అతడి స్థానంలో జట్టులోకి యువ క్రికెటర్ ఆయుష్ బడోనిని ఎంపిక చేశారు. అయితే అతడి ఎంపికపై పలు విమర్శలు వస్తున్నాయి. టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ సైతం ఈ ఎంపికను ప్రశ్నించాడు. అది సరైన నిర్ణయం కాదన్నాడు. ఇటీవల కాలంలో అతడి దేశవాళీ ప్రదర్శన సరిగాలేదన్నాడు. అలాంటప్పుడు టీమ్‌ఇండియాకు ఎలా ఎంపిక చేస్తారన్నాడు. 'ఒకరి విషయంలో మాత్రం పరుగులు చేస్తేనే జట్టులో చోటు అంటున్నారు. ఇంకొకరి విషయంలోనేమో రన్స్ చేయకున్నా జట్టుకు ఎంపిక చేస్తున్నారు. ఐపీఎల్‌లో బడోని ఆడిన అద్భుత ఇన్నింగ్స్ ఏదైనా ఉంటే.. నాకు ఎవరైనా గుర్తు చేస్తారా? ఐపీఎల్ ప్రదర్శనను వన్డేలకు ప్రామాణికంగా తీసుకోకూడదు. అతడు కేవలం మూడు వికెట్లు తీసుకున్నంత మాత్రాన మీరు అతడిని ఆల్‌రౌండర్ అంటున్నారు. అతను ఐపీఎల్ ఎన్నిసార్లు బౌలింగ్ చేశాడు. అతడు బౌలింగ్ చేయడం ఎవరైనా చూశారా?' అని శ్రీకాంత్ సెలక్టర్లను ప్రశ్నించాడు. అలాగే రుతురాజ్ గైక్వాడ్ ను ఎంపిక చేయకపోవడంపై కూడా శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'గత వన్డే సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ చేశాడు. అతడేం తప్పు చేశాడని ఇప్పుడు ఎంపిక చేయలేదు. ఒక వేళ ఆల్‌రౌండర్ అవసరం అయితే అక్షర్ పటేల్‌ను ఎందుకు తీసుకోలేదు' అని పలు ప్రశ్నలు సంధించాడు.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్..

## నం.1 స్థానం సొంతం చేసుకున్న విరాట్ కోహ్లి

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి తాజాగా ఐసీసీ విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో నం.1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. దాదాపు నాలుగేళ్ల తర్వాత అతడు ఈ ఘనతను సాధించాడు. విరాట్.. చివరిసారిగా జులై 2021లో నం.1 ర్యాంకులో ఉన్నాడు. వడోదర వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో అతడి అద్భుత ప్రదర్శన కారణంగా టాప్‌లోకి దూసుకెళ్లాడు. ఈ మ్యాచ్‌లో అతడు 91 బంతుల్లో 93 పరుగులు సాధించాడు. వన్డేల్లో పునరాగమనం తర్వాత విరాట్ నిలకడగా రాణిస్తున్న విషయం తెలిసిందే. గత అయిదు ఇన్నింగ్స్‌ల్లో వంసగా 50 ప్లస్ స్కోర్లు సాధించాడు. ఓవరాల్‌గా 469 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలున్నాయి. ప్రస్తుతం అతడు 785 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లి మొదటి సారిగా అక్టోబర్ 2013లో నం.1 ర్యాంకుకు చేరుకుని, రికార్డ్ స్థాయిలో 825 రోజుల పాటు కొనసాగిన విషయం తెలిసిందే. టీమ్‌ఇండియాతో జరిగిన మొదటి మ్యాచ్‌లో 84 పరుగులు చేసిన న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్ 784 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ మొదటి స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయాడు. అతడి ఖాతాలో 775 రేటింగ్ పాయింట్లున్నాయి.




## డెన్మార్క్‌లో విద్యుత్ కోతతో నేనూ సమస్యలు ఎదుర్కొన్నా

### కిదాంబి శ్రీకాంత్



దిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం వల్ల ప్రస్తుతం జరుగుతోన్న 'ఇండియా ఓపెన్' టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రపంచ నంబర్ 3, డెన్మార్క్ ప్లేయర్ ఆండర్స్ ఆంటన్సెన్ ప్రకటించిన విషయం తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మియా బ్లిచ్‌ఫెల్ట్ సైతం పరిశుభ్రత లేదనే కారణంతో మ్యాచ్ నుంచి వైదొలగింది. దీనిపై ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ స్పందించారు. అంతర్జాతీయ క్రీడల సమయంలో ప్రతి దేశం క్రీడాకారులకు మంచి సౌకర్యాలు కల్పించాలనే అనుకుంటుందని..కానీ కొన్ని సమయాల్లో చిన్న చిన్న సమస్యలు, లోపాలు తలెత్తుతాయని అన్నారు. ఇటువంటివి ఎవరూ కావాలని చేయరని అన్నారు. 2016–17లో తాను డెన్మార్క్‌లో మ్యాచ్‌లో పాల్గొన్న సమయంలో అక్కడి విద్యుత్ కోతల వల్ల ఫ్లడ్‌లైట్ వైఫల్యం తలెత్తిందని గుర్తు చేసుకున్నారు. మ్యాచ్ మధ్యలో ఫ్లడ్‌లైట్లు ఆరిపోవడంతో గంట సేపు వేచి ఉండాల్సి వచ్చిందన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో భాగంగా ఆటగాళ్లు వివిధ దేశాలకు వెళ్లాల్సి వస్తుందని..ఆ సమయంలో అక్కడి సవాళ్లను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతోన్న 'ఇండియా ఓపెన్' టోర్నీ వేదిక అపరిశుభ్రంగా ఉందని డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మియా బ్లిచ్‌ఫెల్ట్ విమర్శించారు. అయితే ఈ వాదనలను భారత బ్యాడ్మింటన్ సంఘం ఖండించింది. బ్లిచ్‌ఫెల్ట్ వ్యాఖ్యలు పాత కేడీ జాదవ్ స్టేడియంలోని వార్మప్ ప్రాంతాన్ని సూచిస్తున్నాయని బీఏఐ ప్రధాన కార్యదర్శి సంజయ్ మిశ్రా అన్నారు. ప్రస్తుతం పోటీలు జరుగుతోన్న ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ వేదికను శుభ్రంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# మన శంకరవరప్రసాద్ కలెక్షన్ల దూకుడు

- రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక
- కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న దర్శకుడు

ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజూ కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తంచేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' విజయం సాధించడంతో చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించింది. 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు అనిల్‌రావిపూడి తెలిపారు. ఛాలెంజ్‌గా తీసుకుని సినిమాను పూర్తి చేసినట్లు చెప్పారు. ఇక తన అంచనా ప్రకారం ఈ చిత్రానికి రూ.400 నుంచి 500 కోట్లు వస్తాయని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో చిత్రబృందం తాజాగా సెలబ్రేషన్స్ చేసుకుంది.





## పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ

### తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

# సంక్రాంతికి నవ్వులు పండించిన అనగనగా ఒకరాజు

రివ్యూ




నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజుఅంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక పల్లెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్థంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్థంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్థం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీ-యార్థంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్థంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.



## అసలైన విజయం ఇప్పుడు దక్కింది

మరీ ఎక్కువగా ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా... నటిగా తొలి అడుగులు వేస్తున్న సమయంలోనే శ్రీలీల అగ్ర హీరోలతో కలిసి నటించే అవకాశాల్ని అందుకుంది. ఆ అవకాశాలకు తగ్గట్టుగానే ఆమె తన అందంతో ప్రేక్షకుల్ని ఆకర్షించింది. హుషారైన డ్యాన్స్‌తో కమర్షియల్ సినిమాలకు తగ్గ కథనాయిక అనిపించుకుంది. తెలుగు సినిమాల్లో ఆమెకు పాటలతోనే ఎక్కువగా పేరొచ్చింది. అయితే ఇప్పుడు తన నటనకీ గుర్తింపు లభించిందనే ఆనందంలో ఉంది ఈ అచ్చ తెలుగమ్మాయి. ఇటీవలే శ్రీలీల తమిళంలో 'పరాశక్తి' చిత్రంలో నటించింది. ఆ సినిమాకి అక్కడ మిశ్రమ స్పందన లభించినా, శ్రీలీల నటనకి మాత్రం మంచి పేరొచ్చింది. అదే విషయాన్నే ఆమె ఓ వేడుకలో ప్రస్తావిస్తూ... ఎప్పుడూ పాటలు, డ్యాన్సులతోనే తనని గుర్తించేవారని, అందుకు భిన్నంగా మొట్ట మొదటిసారి పూర్తిగా తన నటన గురించే మాట్లాడుతున్నారని అంది. ప్రేక్షకులు, పరిశ్రమ నుంచి ప్రశంసలు లభిస్తుండడం ప్రత్యేకమైన అనుభూతిని పంచుతోందని, అసలైన విజయం ఇప్పుడు దక్కిందనే భావనలో ఉన్నానని చెప్పుకొచ్చింది శ్రీలీల. తమిళంలో ఆమె చేసిన తొలి సినిమా ఇదే. త్వరలోనే హిందీలోకీ అడుగు పెట్టనుంది.



## నేనెందుకు క్షమాపణలు చెప్పాలి: మైలకా అరోరా

ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com